ఉచితాలతో ముప్పే

- రాష్ట్రాల ఖజానాలపై అదనపు భారమే
- ఫ్రీ బస్సు, ఫ్రీ పవర్, మహిళలకు ఆర్థిక సాయం స్కీమ్‌లతో ఆర్థిక వనరుల క్షీణత
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆందోళన
- సామాజిక, ఆర్థిక మౌలిక వసతులపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు హితవు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అధికారమే లక్ష్యంగా ఎన్నికల్లో గ్యారెంటీలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్ ఉచిత హామీలతో రాష్ట్రాలు దివాలా దిశగా పయనిస్తున్నాయి. ఇదే విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదిక ద్వారా తూర్పారబట్టింది. ప్రభుత్వాలు ప్రకటించే ఉచితాలతో రాష్ట్ర ఖజానాలపై పెను భారం పడుతున్నదని ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. తద్వారా సామాజిక, ఆర్థిక మౌలిక వనరులను నష్టపోతున్నట్టు పేర్కొంది. ఈ మేరకు 'స్టేట్ ఫైనాన్సెస్: ఏ స్టడీ ఆఫ్ బడ్జెట్స్ ఆఫ్ 2024-25' పేరిట పలు హెచ్చరికలు జారీ చేసింది.

ఆర్థిక క్రమశిక్షణపై నివేదికలోని కీలకాంశాలు

- 2024-25 బడ్జెట్‌లో పలు రాష్ట్రాలు ఉచిత హామీలకు, సబ్సిడీలకు భారీ వ్యయాన్ని కేటాయించాయి. ఇది ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు నష్టదాయకమే.
- ముఖ్యంగా, ఉచిత రవాణా (ఫ్రీ బస్సు), ఉచిత గ్యాస్ సిలిండర్లు, గృహావసరాలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు నగదు సాయం, సాగుకు ఫ్రీ కరెంటు, రైతు రుణ మాఫీ, నిరుద్యోగభృతి ఇలాంటి పథకాలను ప్రకటించి కొన్ని పార్టీలు ఆకట్టుకొనే ప్రయత్నం చేశాయి.
- ఈ తరహా పథకాలు, సబ్సిడీలతో రాష్ట్ర ఖజానాపై ఆర్థిక భారం పడుతుంది. నిధుల్లో క్షీణత పెరుగుతుంది.
- ఖజానాలో డబ్బులు లేకపోవడంతో ఆయా రాష్ట్రాలపై ఒత్తిడి పెరుగుతుంది.
- దీంతో సామాజిక, ఆర్థిక మౌలిక వసతులకు సంబంధించిన కొత్త ప్రాజెక్టులు ఏమీ ఉండబోవు.
- సబ్సిడీలు, ఉచితాలు ప్రకటించేప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి వ్యవహరించాలి.
- ఉత్పాదక వ్యయానికి గండి పడకుండా, ఖజానాపై భారం పడకుండా చూసుకోవాలి.



కాంగ్రెస్ గ్యారెంటీలపై ఖర్గే ఫైర్

ఎన్నికల్లో గెలుపు కోసం ముందూ వెనుక ఆలోచించకుండా కాంగ్రెస్ ప్రకటిస్తున్న ఉచిత హామీలపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత నెలలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'కర్ణాటకలో మీరు (కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం) ఐదు గ్యారెంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చారు. మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని మహారాష్ట్రలో 5 గ్యారెంటీలను ప్రకటించాం. జార్ఖండ్‌లోనూ దాదాపు ఇదే విధానాన్ని పాటించాం. రాష్ట్రాల బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించండి. లేదంటే రాష్ట్రాలు దివాలా తీసే పరిస్థితికి చేరొచ్చు. ప్రణాళికా రహిత విధానం కారణంగా ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది' అంటూ ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హామీల కారణంగా రాష్ట్రాలకు దివాలా తీసే పరిస్థితి రానీయవద్దని ఆయన నేతలకు సూచించారు. కాగా కాంగ్రెస్ ఉచిత హామీలతో ఆ పార్టీ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్ ఇప్పటికే దివాలా అంచుకు చేరుకోగా, కర్ణాటక, తెలంగాణ కూడా పెద్దయెత్తున అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే.

హర్యానా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూత

గురుగ్రామ్: హర్యానా మాజీ ముఖ్యమంత్రి, ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా కన్నుమూశారు. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ కుమారుడైన 89 ఏండ్ల చౌతాలాకు శుక్రవారం గుండెపోటు రావడంతో వెంటనే దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. ఆయన గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. 1989 నుంచి 2005 వరకు ఐదుసార్లు ఆయన హర్యానా ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. ఆయన భార్య స్నేహలత ఐదేండ్ల క్రితమే మరణించారు. చౌతాలా మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

రైతు నేత జగ్జీత్ సింగ్ ఆరోగ్య బాధ్యత పంజాబ్‌దే

దవాఖానకు తరలించకపోవడంపై ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: తమ డిమాండ్ల సాధనకు 25 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ ఆరోగ్యానికి పంజాబ్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించిన సుప్రీం కోర్టు, ఆయనను తాత్కాలిక దవాఖానకు తరలించి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని పేర్కొంది. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు హెచ్చరించిన క్రమంలో సుప్రీం ఈ హెచ్చరికలు జారీ చేసింది. దీక్షా స్థలి వద్ద ఉన్న దవాఖానకు దల్లేవాల్‌ను ఎందుకు తరలించ లేదని ధర్మాసనం ప్రశ్నించింది.

■ భార్యకు భరణంగా 'చిల్లర'

కోయంబత్తూర్, డిసెంబర్ 20: మాజీ భార్యకు భరణం చెల్లించాలని ఆదేశించిన న్యాయమూర్తిని ఓ వ్యక్తి ఆశ్చర్యపరిచాడు. తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన ఓ ట్యాక్సీ డ్రైవర్(37)పై గత ఏడాది ఆయన భార్య విడాకుల పిటిషన్ దాఖలు చేసింది. కోయంబత్తూర్ ఫ్యామిలీ కోర్టు ఈ కేసును విచారిస్తున్నది. కాగా, మధ్యంతర భరణంగా భార్యకు రూ.2 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. బుధవారం ఈ డబ్బులను చెల్లించేందుకు అతడు 20 సంచులను కోర్టుకు తీసుకొచ్చాడు. సంచుల నిండా రూపాయి, రెండు రూపాయల నాణేలు ఉన్నాయి. వీటిని చూసి ఆశ్చర్యపోయిన న్యాయమూర్తి.. నగదు రూపంలో డబ్బులు చెల్లించాలని ఆదేశించి తిప్పి పంపించారు. గత ఏడాది జూన్‌లోనూ రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి ఇలానే భార్యకు రూ.55 వేల భరణాన్ని నాణేల రూపంలో ఇచ్చాడు. వీటిని అతడే లెక్కించాలనే షరతుతో కోర్టు నాణేలను అంగీకరించింది.

ప్రతి 127 మందిలో ఒకరికి ఆటిజం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: ప్రపంచవ్యాప్తంగా 2021లో ప్రతి 127 మందిలో ఒకరికి ఆటిజం ఉందని ప్రపంచ వ్యాధుల భారం(జీబీడీ) అధ్యయనం అంచనా వేసింది. 20 సంవత్సరాల లోపు యువతలో ప్రాణాంతకం కాని పది అనారోగ్య కారణాల్లో ఆటిజం ఒకటని తెలిపింది. ఆటిజం ఉన్నవారు ప్రవర్తన పరంగా, సామాజిక నైపుణ్యాల పరంగా వెనకబడి ఉంటారు. లాన్సెట్ సైకియాట్రి జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి లక్ష మంది పురుషుల్లో 1,065 ఆటిజం కేసులు నమోదవగా, మహిళల్లో 508 మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఆటిజం బాధితులు ఎక్కువగా ఉన్నారు.

సిరియా శ్మశానంలో లక్ష మృతదేహాలు

డమాస్కస్: పదవీచ్యుతుడైన సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దారుణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రాజధాని నగరం డమాస్కస్‌కు ఉత్తర దిశలో 30 కి.మీ. దూరంలో అల్ కుటేఫా వద్ద ఓ శ్మశాన వాటిక భూమి అడుగున సెల్లార్‌లో సుమారు 1 లక్ష మృతదేహాలు కనిపించాయి. అంతర్యుద్ధంలో మరణించిన వారిని, రాజకీయ ప్రత్యర్థులను ఇక్కడ పడేసేవారని వెల్లడైంది. పదేళ్ల క్రితం సిరియా దళాలు ఈ శ్మశాన వాటికను ఏర్పాటు చేసినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాలనుబట్టి తెలుస్తున్నది. మొదట్లో ఇది లోతుగా ఉండేది కాదని, శవాలను కుక్కలు బయటకు లాగుతూ ఉండేవని, ఆ తర్వాత దీనిని లోతుగా తవ్వించారని స్థానికులు చెప్పారు.

■ పరువు 'చెత్త'పాలు

టోక్యో: 'తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయండి' అని ఎంతగా చెప్తున్నా వినని ప్రజల పట్ల జపాన్‌లోని ఫుకుషిమా నగరం వినూత్న నిర్ణయం తీసుకుంది. చెత్త వేరు చేయని వారి పేర్లను బహిర్గతపర్చాలని నిర్ణయించింది. మంగళవారం తీసుకున్న ఈ నిర్ణయం వచ్చే ఏడాది మార్చి నుంచి అమలులోకి రానున్నది. జపాన్‌లో చెత్త వేయడానికి, వేరు చేయడానికి సంబంధించి కూడా నిబంధనలు అమలులో ఉన్నాయి. అయితే, ఫుకుషిమా మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు ఈ నిబంధనలు పాటించకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో ఇక కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ నిర్ణయించింది. నిబంధనలు పాటించని ఉల్లంఘనుల పేర్లను తమ వెబ్‌సైట్‌లో ఉంచుతామని ప్రకటించింది.

■ కారులో 52 కిలోల బంగారం.. 11 కోట్ల నగదు

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు వదిలిపెట్టి వెళ్లిన ఓ ఎస్‌యూవీలో భారీగా నగదు, బంగారం లభించింది. కుశల్‌పురా రోడ్డులో ఇన్నోవా క్రిస్టా కారు నిలిపి ఉందని, అందులో చాలా మూటలు కనిపిస్తున్నాయే కాని మనుషులెవరూ లేరని గురువారం రాత్రి తమకు సమాచారం అందినట్లు డీసీపీ ప్రియాంక శుక్లా శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఐటీ శాఖకు సైతం సమాచారం అందచేయగా వారు అక్కడకు చేరుకుని కారు కిటికీ అద్దాలు పగలగొట్టి 52 కిలోల బంగారు బిస్కెట్లను, భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారని ఆమె చెప్పారు. ఎంపీ-07 సిరీస్‌లో వాహనం నంబర్ రిజిస్టర్ అయి ఉందని, దాని యజమాని పేరు చందన్ సింగ్ గౌర్‌గా నమోదై ఉందని డీసీపీ వివరించారు. గ్వాలియర్‌కు చెందిన ఆ వ్యక్తి గత కొంత కాలంగా భోపాల్‌లో నివసిస్తున్నట్టు ఆమె తెలిపారు. కాగా.. వాహనం నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు విలువ మొత్తంగా రూ.52 కోట్లు ఉంటుందని ఐటీ(దర్యాప్తు) డైరెక్టర్ జనరల్ సతీష్ కె గోయల్ తెలిపారు.

■ ఇక నుంచి 'సైబర్ క్రైమ్' కాలర్ ట్యూన్లు



న్యూఢిల్లీ, డిసెంబర్ 20: ఇక నుంచి మీరు ఎవరికైనా ఫోన్ చేస్తే తప్పనిసరిగా 'సైబర్ క్రైమ్ అవగాహన' కాలర్ ట్యూన్‌ను వినాల్సిందే. సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించుకుంది. దీంతో ప్రతి ఫోన్‌కు రోజుకు 8-10 సార్లు ఈ కాలర్‌ట్యూన్‌ను వినియోగదారులకు విన్పించాలని టెలికం శాఖ ద్వారా ఆపరేటర్లకు ఆదేశాలు జారీచేసింది. ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఇచ్చే ఈ కాలర్ ట్యూన్‌లను మూడు నెలల పాటు విన్పించాలని, దీనిపై తక్షణం చర్యలు చేపట్టాలని హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్‌క్రైం విభాగం ఆదేశించింది. కాగా, ఇటీవలి కాలంలో కొందరు సైబర్ నేరగాళ్లు అంతర్జాతీయ నకిలీ కాల్స్ ద్వారా వినియోగదారులను డిజిటల్ అరెస్ట్, కేవైసీ, లాటరీ, ఇన్సూరెన్స్ తదితరాల పేరుతో పెద్దయెత్తున మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో కేంద్రం నవంబర్ 15 వరకు 6.69 లక్షల సిమ్‌లను, 1,32,000 ఐఎంఈఐలను బ్లాక్ చేసింది.

39 మంది ఎంపీలతో జేపీసీ

- జమిలి బిల్లులు సిఫార్సు చేస్తూ లోక్ సభ తీర్మానం
- కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ పీపీ చౌధరి నియామకం
- ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాలు

చౌధరి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: జమిలి ఎన్నికలకు వీలు కల్పించే రెండు బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపిస్తూ శుక్రవారం లోక్‌సభలో తీర్మానం చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఉదయం సభ ప్రారంభం కాగానే ఇండియా కూటమి సభ్యులు నినాదాలు ప్రారంభించారు. వీరి ఆందోళన కొనసాగుతుండగానే న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తీర్మానం ప్రవేశపెట్టగా, మూజువాణీ ఓటు ద్వారా ఆమోదం పొందినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం సభను నిరవధిక వాయిదా వేశారు.

జేపీసీ చైర్మన్‌గా పీపీ చౌధరి

39 మంది సభ్యులతో జేపీసీ ఏర్పాటైంది. మొదట 31 మంది సభ్యులతో జేపీసీ వేయాలని నిర్ణయించగా, ఎక్కువ పార్టీలకు చోటు కల్పించేందుకు సభ్యుల సంఖ్యను 39కి పెంచారు. కమిటీలో బీజేపీ నుంచి 16 మందికి, కాంగ్రెస్ నుంచి ఐదుగురికి, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే నుంచి ఇద్దరు చొప్పున, శివసేన, టీడీపీ, జేడీయూ, ఆర్ఎల్‌డీ, ఎల్‌జేఎస్‌పీ(ఆర్‌వీ), జేఎస్పీ, శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ), సీపీఎం, ఆప్, బీజేడీ, వైసీపీ నుంచి ఒకరి చొప్పున చోటు దక్కింది. ఈ కమిటీకి చైర్మన్‌గా బీజేపీ ఎంపీ, మాజీ కేంద్రమంత్రి పీపీ చౌధరిని స్పీకర్ ఓం బిర్లా నియమించారు.

ఉభయసభలు నిరవధిక వాయిదా

పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిశాయి. శుక్రవారం జమిలి బిల్లులను జేపీసీకి పంపుతూ తీర్మానం చేసిన తర్వాత లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా నిరవధిక వాయిదా వేశారు. జేపీసీకి 12 మంది సభ్యులను సిఫార్సు చేస్తూ రాజ్యసభలో తీర్మానం చేసిన తర్వాత సభను చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కడ్ నిరవధిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కాగా, నవంబర్ 25 ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు అంతరాయాలు, వాయిదాలతో కొనసాగాయి. రాజ్యాంగం 75 ఏండ్ల ప్రస్థానంపై ఉభయసభల్లో చర్చ జరిగింది. కాగా, లోక్‌సభ ఉత్పాదకత 57.87 శాతమని, రాజ్యసభ ఉత్పాదకత 40.03 శాతమని అధికార వర్గాలు తెలిపాయి. కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నియమితులయ్యారు.

ఎల్పీజీ ట్యాంకర్‌లో మంటలు..

11 మంది దుర్మరణం

జైపూర్, డిసెంబర్ 20: ఎల్పీజీ ట్యాంకర్ ట్రక్‌ను ఢీ కొనడంతో మంటలు చెలరేగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం జైపూర్-అజ్మీర్ రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. సుమారు 37 వాహనాలు మంటల్లో కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు 35 మంది గాయపడ్డారని... అందులో సగం మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని రాజస్థాన్ వైద్య శాఖ మంత్రి గజేంద్ర సింగ్ వెల్లడించారు. ట్యాంకర్ ట్రక్‌ను ఢీ కొనప్పుడు దాని నాజిల్ దెబ్బ తిని గ్యాస్ లీకవడం వల్ల మంటలు చెలరేగి చుట్టుపక్కల వాహనాలకూ వ్యాపించాయని జైపూర్ పోలీస్ కమిషనర్ తెలిపారు. చనిపోయినవారి కుటుంబాలకు రాజస్థాన్ సర్కారు రూ.5 లక్షలు, ప్రధాని తన జాతీయ సహాయ నిధి తరపున రూ.2 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించాయి. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష, ప్రధాని సహాయ నిధి రూ.50 వేలు పరిహారంగా ఇస్తామని తెలిపాయి.

ఎండుకొబ్బరికి ఎంఎస్‌పీ 422 పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: రానున్న 2025 సీజన్‌లో ఎండుకొబ్బరికి కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ని క్వింటాలుకు రూ.422 పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఎంఎస్పీ క్వింటాలు రూ.12,100 చేరుకుంది. ఇందుకోసం రూ. 855 కోట్ల బడ్జెట్ కేటాయింపులు కేంద్రం చేసింది. ప్రధాని అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మిల్లింగ్ ఎండుకొబ్బరికి ఎంఎస్పీని క్వింటాలుకు రూ. 422, బంతి కొబ్బరికి ఎంఎస్పీని క్వింటాలుకు రూ. 100 పెంచినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దేశంలో ఎండుకొబ్బరి మొత్తం ఉత్పత్తిలో 32.7 శాతం కర్ణాటకలో జరుగుతుండగా, తమిళనాడులో 25.7 శాతం, కేరళలో 25.4 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 7.7 శాతం జరుగుతోంది.

షట్‌డౌన్ దిశగా అమెరికా

కీలక బిల్లును తిరస్కరించిన ప్రతినిధుల సభ

ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయే పరిస్థితి

వాషింగ్టన్, డిసెంబర్ 20: అధికార మార్పిడికి సిద్ధమవుతున్న అమెరికా ఆర్థిక ప్రతిష్టంభన దిశగా అడుగులు వేస్తున్నది. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లును ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం రాత్రిలోగా ఈ బిల్లు ఆమోదం పొందకపోతే 'షట్‌డౌన్' తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి గతంలో బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లును కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. దీంతో మార్చి 14 వరకు ప్రభుత్వానికి నిధులను సమకూర్చేలా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. రుణాలపై సీలింగ్‌ను రెండేండ్లపాటు సస్పెండ్ చేయడం సహా ట్రంప్ లేవనెత్తిన పలు డిమాండ్లను ఇందులో చేర్చారు. దీంతో కొత్త బిల్లుకు ట్రంప్ మద్దతు తెలపడంతోపాటు దానికి అనుకూలంగా ఓటేయాలని రిపబ్లికన్లకు పిలుపునిచ్చారు. కానీ, ఈ బిల్లును డెమోక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతినిధుల సభలో ఓటింగ్ నిర్వహించడంతో ఆ బిల్లు 235-174 తేడాతో తిరస్కరణకు గురైంది. ఈ బిల్లును వ్యతిరేకించిన డెమోక్రాట్లకు ఏకంగా 38 మంది రిపబ్లికన్లు మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. సెనేట్‌లో కూడా డెమోక్రాట్ల పట్టు కొనసాగుతుండటంతో ఈ బిల్లుకు ఆమోదం లభించడం క్లిష్టంగా మారింది. శుక్రవారం రాత్రిలోగా ప్రభుత్వానికి నిధులు సమకూర్చడంలో పార్లమెంట్ విఫలమైతే అమెరికాలో మరోసారి షట్‌డౌన్ తప్పదని, ఇది ఎంత కాలం కొనసాగుతుందో చెప్పలేమని నిపుణులు అంటున్నారు. గతంలో ట్రంప్ హయాంలో 35 రోజులపాటు షట్‌డౌన్ కొనసాగిందని గుర్తుచేస్తూ.. అమెరికా చరిత్రలో ఇదే సుదీర్ఘమైన షట్‌డౌన్ అని పేర్కొంటున్నారు.

షట్‌డౌన్‌తో సమస్యలు ఇవీ..

షట్‌డౌన్ వల్ల లక్షల మంది ఉద్యోగులకు జీతాలు నిలిచిపోతాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 8.75 లక్షల మంది ఉద్యోగుల సేవలు ఆగిపోతాయి.

1,500 మంది భారతీయులు అమెరికా నుంచి తరలింపు

హిట్‌లిస్టులో మరో 18 వేల మంది భారతీయులు

వాషింగ్టన్: లక్షలాది మంది అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించి వేస్తామని దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడానికి ముందే ట్రంప్ ప్రకటించగా గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 2.70 లక్షల మందికిపైగా అక్రమ వలసదారులను భారత్ తోసహా 192 దేశాలకు పంపించివేసినట్టు అమెరికా అధికారులు వెల్లడించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో ఐసీఈ 2,647 మంది భారతీయులను తరలింపు నిమిత్తం నిర్బంధించింది. వీరిలో 1,500 మందిని భారత్‌కు తరలించి వేసింది. మెక్సికో, హోండురాస్, గ్వాటెమాలా తర్వాత నాలుగవ స్థానంలో భారత్ అక్రమ వలసదారుల సంఖ్య నిలుస్తుంది. బైడెన్ పాలనలో చివరి వార్షిక నివేదిక ప్రకారం ట్రంప్ గతంలో మొదటిసారి అధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో కూడా ఇంత భారీ సంఖ్యలో అక్రమ వలసవాదుల తరలింపు జరగలేదని తెలుస్తోంది. గడచిన దశాబ్ద కాలంలో ఒక్క సంవత్సరంలోనే ఇంత భారీ సంఖ్యలో తరలింపులు జరగడం ఇదే మొదటిసారి. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రారంభమయ్యే అక్రమ వలసదారుల తరలింపులో ఈ 18వేల మంది భారతీయులు కూడా ఉండనున్నారు.

కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులతో రష్యా దాడి

కీవ్, డిసెంబర్ 20: ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై శుక్రవారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిలో ఒకరు మరణించినట్టు రష్యా అధికారులు ప్రకటించారు. అమెరికా తయారీ క్షిపణులతో ఇటీవల తమ దేశంపై ఉక్రెయిన్ చేసిన దాడికి ప్రతీకారంగానే క్షిపణులను ప్రయోగించినట్టు వారు చెప్పారు. రష్యా దాడిలో కీవ్ నగరంలోని 630 నివాస గృహాలు, 16 వైద్య సంస్థలు, 30 పాఠశాలలు దెబ్బతిన్నట్టు అధికారులు చెప్పారు.

'బ్రిటిషర్లు భారత్‌ను వదలడానికి కారణం సత్యాగ్రహం కాదు'

పనాజీ: బ్రిటిషర్లు భారత దేశాన్ని విడిచి వెళ్లడానికి కారణం సత్యాగ్రహం కాదని, వారు జనం చేతుల్లో ఆయుధాలను చూశారని, పరిస్థితి ఏ స్థాయికైనా వెళ్లవచ్చునని గ్రహించారని బీహార్ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ చెప్పారు. భారతీయ చారిత్రక పరిశోధన మండలి ఓ కథనాన్ని సృష్టించిందని, ''మీరు పుట్టుకతోనే బానిసలు'' అంటూ ప్రచారం చేసిందని, దానిని అప్పటి ప్రభుత్వం సమర్థించిందని చెప్పారు. ఆనందిత సింగ్ రాసిన ''ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ నార్త్ ఈస్ట్ ఆఫ్ ఇండియా (1498-1947)' ఆవిష్కరణ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాలపై వ్యాఖ్యానించారు.

'ఆధునిక సమాజపు దేవాలయాలు దవాఖానలు'

కొచ్చి: దవాఖానలు ఆధునిక సమాజ దేవాలయాలని, ఆరోగ్య, సంక్షేమ దేవతలను కొలిచేందుకు ప్రజలు అక్కడికి వెళ్తారని కేరళ హైకోర్టు చెప్పింది. అలాంటి దవాఖానలను ధ్వంసం చేయడాన్ని చట్టబద్ధంగా కఠినంగా నిరోధించాలని తెలిపింది. దవాఖాన అంటే కేవలం భౌతిక నిర్మాణం కాదని, ఆశావాదం, సాంత్వనల చిహ్నమని వ్యాఖ్యానించింది. దవాఖానల్లో విధ్వంసాలకు పాల్పడేవారికి బెయిలు మంజూరు చేయడానికి కొన్ని ఆంక్షలు అవసరమని పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ సిబ్బంది, సంస్థల విధ్వంసం, హింసాకాండను నిరోధించేందుకు రాష్ట్ర చట్టంలో సవరణలు అవసరమని తెలిపింది.

10 శాతం సిబ్బందిపై గూగుల్ వేటు

న్యూఢిల్లీ: గూగుల్ తన మేనేజిరియల్ స్థాయి సిబ్బందిలో 10% మందిపై వేటు వేసింది. దీర్ఘ కాలంలో సంస్థ సామర్థ్యాన్ని రెండింతలు చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. బుధవారం జరిగిన కంపెనీ సర్వ సభ్య సమావేశంలో సీఈవో సుందర్ పిచాయ్ ఈ మేరకు కోతల గురించి ప్రకటించినట్లు పలు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉద్యోగాలు కోల్పోనున్న వారిలో మేనేజర్, డైరెక్టర్, ఉపాధ్యక్షుడి స్థాయి ఉద్యోగులున్నట్టు తెలిసింది. కృత్రిమ మేధ వేగంగా అభివృద్ధి చెందడంతో గూగుల్ ఆన్‌లైన్ సెర్చ్ వ్యాపారానికి ప్రమాదం ఏర్పడింది.

ఖాళీ మెడికల్ సీట్ల భర్తీకి స్పెషల్ కౌన్సెలింగ్

న్యూఢిల్లీ : దేశం తీవ్రమైన వైద్యుల కొరతను ఎదుర్కొంటున్నదని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. మెడికల్ సీట్లు చాలా విలువైనవని, వాటిని వృథాకానివ్వరాదని తెలిపింది. ఖాళీగా ఉన్న మెడికల్ సీట్లను భర్తీ చేయడం కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. వైద్య కోర్సుల ప్రవేశ ప్రక్రియను ఈ నెల 30నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేసింది. కళాశాలలు కేవలం ప్రభుత్వ అడ్మిషన్ వ్యవస్థ ద్వారా మాత్రమే ప్రవేశాలను కల్పించాలని స్పష్టం చేసింది. వెయిట్‌లిస్టెడ్ క్యాండిడేట్ల నుంచి మాత్రమే ఎంపిక చేయాలని వివరించింది.

పాక్ కంటే బంగ్లాలోనే హిందువులపై ఎక్కువ హింస

న్యూఢిల్లీ: హిందువులపై హింస పాకిస్థాన్‌లో కన్నా బంగ్లాదేశ్‌లో ఎక్కువగా జరుగుతున్నదని భారత ప్రభుత్వం తెలిపింది. 2024లో హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించిన కేసులు బంగ్లాదేశ్‌లో 2,200, పాక్‌లో 112 వెలుగులోకి వచ్చినట్లు చెప్పింది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత హిందువులపై హింస విపరీతంగా పెరిగిందని తెలిపింది. 2022లో వీరిపై హింసాత్మక సంఘటనలు బంగ్లాదేశ్‌లో 241, పాక్‌లో 47 జరిగాయని, 2023లో బంగ్లాదేశ్‌లో 302, పాకిస్థాన్‌లో 103 జరిగాయని పేర్కొంది. విదేశాంగ శాఖ శుక్రవారం రాజ్యసభకు ఈ వివరాలు తెలిపింది.

మృతదేహాన్ని 30 కి.మీ. ఈడ్చుకెళ్లిన తహశీల్దార్ కారు

లక్నో: యూపీలోని బహ్రెయిచ్‌లో నాయిబ్ తహశీల్దారు శైలేష్ కుమార్ అవస్థి కారు ఓ యువకుడి మృతదేహాన్ని 30 కిలోమీటర్ల మేరకు ఈడ్చుకెళ్లింది. నరేంద్ర కుమార్ హల్దార్(35) బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, నాన్‌పర-బహ్రెయిచ్ రోడ్డుపై ప్రమాదానికి గురయ్యారు. ఆయన మృతదేహం తహశీల్దార్ కారు కింద చిక్కుకుంది. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన తర్వాత డ్రైవర్ కారును వెనుకకు మళ్లిస్తుండగా, మృతదేహం కనిపించింది. అది కారు కింద ఉన్నట్లు తమకు తెలియదని వీరు చెప్పున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై చర్యలేం తీసుకోలేదు: కేంద్రం

న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేంద్రం తెలిపింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సమాధానం ఇచ్చారు. సుప్రీం కోర్టు తీర్పు తమ దృష్టిలో ఉందని మంత్రి చెప్పారు. అయితే, ఈ తీర్పు అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. సామాజికంగా, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లు కల్పించేందుకు షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.